క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



చిన్నగూడూరు: జాతీయస్థాయి స్కాలర్ షిప్‌నకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ చిన్నగూడూరు విద్యార్థి ఎంపికైనట్లు హెచ్ఎం ఎన్. రవికుమార్ తెలిపారు. మంగళవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెహమాన్, సుగుణాకర్, నాగేశ్వర్, రమేశ్, విమలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గార్ల పట్టణ అధ్యక్షుడిగా నర్సయ్య



గార్ల: కాంగ్రెస్ పార్టీ గార్ల పట్టణ అధ్యక్షుడిగా పల్లా నర్సయ్యను నియమిస్తూ మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

హౌసింగ్ బోర్డు కాలనీ అధ్యక్షుడిగా వెంకన్న



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో కాలనీ సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా కట్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా గార్ల పాటి జయపాల్‌రెడ్డి, కోశాధికారిగా బానోత్ ఖాసీంను ఎన్నుకున్నారు.

శ్రీవారి కల్యాణోత్సవం



మహబూబాబాద్ రూరల్: శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామివారు, సత్యంగౌతం మహారాజ్ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామివారి దేవాలయం ఎదుట గల మండపంలో కల్యాణోత్సవం జరిపారు. మంగళవారం ఉదయం శ్రీలక్ష్మినరసింహస్వామి, శ్రీమహాలక్ష్మి యజ్ఞాలు నిర్వహించారు.

వీరన్న సన్నిధిలో ఎమ్మెల్సీ పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామిని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ చైర్మన్ కొర్నురవీందర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆయన వెంట పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంకా బద్రినారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డి, నాయకులు తూడి వెంకటేష్, శివప్రసాద్, వెంకట్‌రెడ్డి, సీతారాములు, రామ్మూర్తి, శ్యామల దేవీ పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న గోటి తలంబ్రాలు



డోర్నకల్: భద్రాచలంలో శ్రీరామనవమి రోజున జరిగే సీతారాముల కల్యాణం కోసం గోటి తలంబ్రాలు సిద్ధమవుతున్నాయి. స్థానిక వేంకటేశ్వరాలయంలో అర్చకులు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా భక్తులు వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు పైనుంచి పడి కార్మికుడి మృతి

డోర్నకల్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పైనుంచి జారిపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. రామగుండంకు చెందిన అంజద్‌ఖాన్(33) డోర్నకల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేశాఖకు చెందిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనుల్లో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం డోర్నకల్‌కు చేరుకున్నాడు. పనుల్లో భాగంగా సుమారు 30అడుగుల పైనుంచి అంజద్‌ఖాన్ ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలాన్ని సివిల్, ఆర్పీఎఫ్ పోలీసులు పరిశీలించారు.

ప్రణాళికతో విజయం ‘పది’లం

- 10రోజుల్లో పదో తరగతి పరీక్షలు
- గడువు సమీపిస్తుండడంతో విద్యార్థుల్లో ఆందోళన
- భయాన్ని వీడితేనే విజయం



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

పెద్దవంగర: పదో తరగతి విద్యార్థి బంగారు భవితకు పునాది. పబ్లిక్ పరీక్షలు అనగానే అటు తల్లిదండ్రులు.. ఇటు విద్యార్థులు ఆందోళనకు గురవడం సహజం. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించింది. పరీక్షలకు ఇక 10రోజుల సమయం మాత్రమే ఉంది. దీంతో కొందరు విద్యార్థులు పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో తెలియక హైరానా పడుతున్నారు. ఈనేపథ్యంలో భయం.. ఒత్తిడి.. ఆందోళనను అధిగమించి మార్కులు సాధించాలని ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. కొన్ని టిప్స్ పాటించడం ద్వారా పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని పేర్కొంటున్నారు. మండలంలోని ఈ ఏడాది 203 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పరీక్షలో మనం చదివింది గుర్తు పెట్టుకొని.. జవాబు పత్రంలో చక్కగా రాయాలంటే కావాల్సింది ఆరోగ్యం. మంచి ఆరోగ్యంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయి. ఇందుకోసం తల్లిదండ్రులు విద్యార్థులపై తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాత్రి 10.30 తర్వాత చదువకూడదు. ఒకవేళ చదివిన పూర్తి స్థాయిలో మొదడు గ్రహించే తత్వం ఉండదు. తెల్లవారు జామున 4గంటలకు చదివితే మొదడుకు వంద శాతం గ్రహించే శక్తి ఉంటుంది. 8గంటలు నిద్రపోవాలి, సెల్‌ఫోన్ టీవీలకు దూరంగా ఉండాలి. మనస్సు ప్రశాంతంగా పెట్టుకోవాలి, పాలు, అరటి, పైనాపిల్, పుచ్చకాయ, చెరకు రసంతో కూడిన ద్రవ పదార్థాలు తీసుకుంటే ఏకాగ్రత పెరుగుతుంది. వేసవికాలం కావడంతో కొబ్బరి బొండాలు, గ్లూకోజ్ నీటిని అధికంగా తీసుకోవాలి. పరీక్షలు రాసి ఇంటికి వచ్చాక తాజా పళ్లు, పళ్ల రసాలు తాగాలి. పెరుగుతో ఆహారం తినడం కూడా మంచిదే. సాయంత్రం చదువు ప్రారంభించేటప్పుడు కప్పు టీ తాగి చదవడం అయిపోయాక నిద్రపోయే గంటముందు తేలిక పాటి భోజనం తీసుకోవాలి. పరీక్షల సమయంలో మాంసాహారాలు తీసుకోరాదు, తీసుకుంటే బద్ధకం వస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే గెలుపు



విద్యార్థులకు సమయపాలన ముఖ్యం. చేయగలిగే లక్ష్యాలను మాత్రమే ఎంచుకోవాలి. ప్రశ్నపత్రంలో కూడా అదే విధంగా తగిన ప్రశ్నకు సమాధానాలు ఎంచుకున్న తర్వాత వాటి సమాధానాలను రాస్తూ వెళ్లే క్రమంలో ఏదైన మర్చిపోతే అక్కడే ఆగిపోకుండా ముందు కెళ్లాలి. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ఎక్కువ ఒత్తిడి చేయొద్దు.

– విజయవర్ధన్ రెడ్డి, హెచ్ఎం, యూపీఎస్ ఉప్పరగూడెం

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం..



పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయించి ప్రత్యేక తరగతులు విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించాం. విద్యార్థుల మంచి మార్కులు సాధించేందుకు రెండు సార్లు టెస్టుల పరీక్షలు చేపట్టాం. ప్రస్తుతం ప్రీఫైనల్ పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానంలో నిలుస్తాం.

– బుదారపు శ్రీనివాస్, ఎంఈఓ, పెద్దవంగర

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: మహిళలు వంటగదికే పరిమితం కాకుండా విద్యా, వైద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయం వంటి అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు.. మంగళవారం మండలంలోని నాంచారీమడూరు గ్రామ శివారు రెడ్డి గార్డెన్‌లో వెటా తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపకురాలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝూన్సీరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు. సమాజంలో ప్రతి మహిళ అన్నిరంగాల్లో భాగస్వాములు అవుతూ, విజయాలు సాధిస్తూ ఆర్థికంగా బలోపేతం అవుతూ ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. భవిష్యత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం మరికొన్ని పథకాలు, రాయితీలను అందించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయా శాఖల మహిళ అధికారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో మహిళ అధికారులు, మహిళ సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఆడపిల్లలు సమాజానికి భారం కాదు

- జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి లక్ష్మీనారాయణ



అవగాహన కల్పిస్తున్న అధికారి లక్ష్మీనారాయణ

కురవి: ఆడపిల్లలు సమాజానికి బారం కాదని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ మహేశ్వరీ అన్నారు. మంగళవారం బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లింగ నిర్ధారణ చట్టం, బేటీ బచావ్–బేటీ పడావ్‌పై వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ, పురుష లింగ నిష్పత్తి సమానంగా ఉండేలా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో స్త్రీ పాత్ర, ప్రాముఖ్యతను వివరించారు. ఎవరైనా అబార్షన్లకు ప్రోత్సహించినట్లయితే వారికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష జరిమానా విధించబడుతుందన్నారు. బలపాల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, డాక్టర్ యశస్విని, అరుణ, సంధ్యారాణి, భద్రమ్మ, శోభ, ఏసుమణి, పారామెడికల్ సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరు అందించే బాధ్యత నాదే

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



నీటి మళ్లింపుపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

బయ్యారం: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు మండలంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత తన దేనని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బయ్యారం పెద్దచెరువుకు పాకాల నీటిని మళ్లింపు సాధ్యాసాధ్యాలపై మంగళవారం ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి నీటిని అందిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేశారన్నారు. మండలంలో నిర్మించిన తులారాం ప్రాజెక్ట్ ద్వారా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదన్నారు. రామప్ప నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పాకాల చెరువుకు దేవాదుల నీటిని అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా లిఫ్ట్ ద్వారా పందిపంపుల వాగులోకి చేరిస్తే బయ్యారం పెద్దచెరువులోకి నీరు చేరుతుందన్నారు. బయ్యారం పెద్దచెరువులో నుంచి లిఫ్ట్ ద్వారా తులారాం ప్రాజెక్ట్‌లోకి అక్కడి నుంచి మహబూబాబాద్ మండలం కంబాలపల్లి చెరువులోకి చేరుతాయని పేర్కొన్నారు. ఇదే నీటిని మహబూబాబాద్ జిల్లా కేంద్ర ప్రజలకు తాగునీటిని అందించవచ్చని తెలిపారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇరిగేషన్‌శాఖ మంత్రిని కలిసి రైతుల కోరికలు నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం మరమ్మతుకు కృషి చేస్తా..

గూడూరు: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజన రైతుల పంటలకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గూడూరు మండలం మట్టెవాడ శివారు, ఇల్లెందు డివిజన్ బయ్యారం మండల ఫారెస్టు రేంజ్ పరిధిలోని తాళ్లపాయి కట్టు(చెక్ డ్యాం) ప్రాంతాన్ని మంగళవారం ఆయన గ్రామస్తుల కోరిక మేరకు పరిశీలించారు. చెక్ డ్యాం మరమ్మతుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు

మహబూబాబాద్ అర్బన్: పాఠశాల, కళాశాల పరిసరాల ప్రాంతాల్లో బాలికలను, యువతులను, మహిళలను ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని షీటీం ఎస్సై సునంద అన్నారు. షీటీం డెకాయి ఆపరేషన్‌లో భాగంగా మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద సోమవారం ఆకతాయిలను గుర్తించి షీటీం బృందం పట్టుకున్నారు. అనంతరం ఆకతాయిల తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేశామన్నారు. కానిస్టేబుల్స్ పార్వతి, సౌభాగ్య పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

నెల్లికుదురు: మండల కేంద్రంలోని 10వ తరగతి పరీక్ష కేంద్రాలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలను ఎంఈఓ రాందాస్ మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు భయాన్ని వీడి నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల 9హైస్కూల్స్‌ల నుంచి 358 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు.

ఇష్టానుసారంగా పన్నుల వసూళ్లు

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలో శాస్త్రీయత పాటించకుండా ఇష్టానుసారంగా అధికారులు పన్నులు వసూలు చేస్తూ, వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నారని మున్సిపాలిటీ పన్ను బాధిత అసోసియేషన్ బాధ్యులు ఆరోపించారు. ఈసందర్భంగా మంగళవారం మరిపెడ వాసవీ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాతూ.. 2018లో మరిపెడ మున్సిపాలిటీ ఏర్పాటు అయిందన్నారు. 2022 మున్సిపాలిటీ పన్నులు విధించి వసూలు చేస్తున్నారని అన్నారు. కానీ కమర్షియల్ పన్ను పేరుతో ఓ పద్ధతి లేకుండా పక్కపక్కన ఉన్న షాపులకే ఒకరికి రూ.10వేలు మరొకరికి రూ. 30 వేల చొప్పున పన్ను విధించి అధికారులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్ను వసూళ్లపై కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తమ సమస్యను పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని బాధితులు, పలు షాపుల యాజమానులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల్లో అవకతవకలు

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఈజీఎస్‌పై మంగళవారం నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు గ్రామాల్లో జరిగిన అవినీతి, అవకతవకలు వెలుగు చూశాయి. డీఆర్‌డీఓ పీడీ మధుసూదన్ రాజు అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం ఆయా గ్రామాల్లో జరిగిన అవకవతకలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం మిగిలిన 13గ్రామాలకు ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీఓ పీడీ ఫీల్డ్ అసిస్టెంట్లకు టీఏలకు సంబంధిత అధికారులు, సిబ్బందికి మొత్తంగా రూ.2,65,572 జరిమానా విధించారు. అంబూర్స్ మన్ ఆదామ్, డీపీసీ మన్‌మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్, ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పత్రాలను అందజేస్తున్న కమిషనర్ రవీందర్

మహబూబాబాద్: ఈనెల 31లోపు ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందని, దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లించిన 15మంది దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్ పత్రాలను కమిషనర్‌కు అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 30మంది ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించారన్నారు. 2020లోపు లేఅవుట్ లేని ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎల్‌ఆర్ఎస్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ ప్రవీణ్, మేనేజర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న ఏఈ రాకేష్

దంతాలపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచుతూ, పర్యావరణాన్ని కాపాడాలని మిషన్ భగీరథ ఏఈ రాకేష్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాట్లలో నిర్వహించిన రాష్ట్రీయ ఆవిష్కార్ సప్తాహ్ 2024–25లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో పర్యావరణం, మానవులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. మొక్కలను పెంచడం వలన సకాలంలో వర్షాలు కురుస్తాయని, వాతావరణం కాలుష్యం తగ్గుతుందని గుర్తు చేశారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం.కృష్ణయ్య, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సాయికుమార్, యాకస్వామి, స్వప్న, రోషిణి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న నాగయ్య

మరిపెడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మరిపెడలో పార్టీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ఆర్థిక విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందన్నారు. ప్రజాసమస్యలతో సతమతం కాకుండా ప్రభుత్వాల విధానాలపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, శెట్టి వెంకన్న, సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, అలువాల వీరయ్య, ఆకుల రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామ చివారు కోళ్లఫాం దగ్గర ఆటో, బైకు ఢీకొనగా ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. పెద్దముప్పారం గ్రామానికి చెందిన దామోదర్ తన మోటారు సైకిల్‌పై తనతోపాటు గ్రామానికి చెందిన కోల యాకయ్య పనుల నిమిత్తం మండలానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన గొడిశాల కల్యాణ్ తన ఆటోలో మామిడి కాయల లోడుతో ఖమ్మం వెళ్తున్నాడు. గ్రామ శివారు కోళ్లఫాం వద్దకు చేరుకోగానే ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో దామోదర్ కాలు విరిగి, తలకు తీవ్రగాయాలు కాగా, యాకయ్యకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దామోదర్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

108 తనిఖీ

కురవి: సీరోలు మండల కేంద్రంలోని అత్యవసర సేవలు అందించే 108 వాహనాన్ని జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. వాహన పనితీరును, పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో 108 పైలెట్ ప్రేమ్‌చంద్, బంగారి పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించాలి

డోర్నకల్: కులగణనకు సంబంధించిన రెమ్యునేషన్ డబ్బును ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం డోర్నకల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

అక్రమంగా రైస్ మిల్లుల నిర్మాణం

కేసముద్రం: కేసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమిలో అక్రమంగా రెండు రైస్‌మిల్లులను నిర్మిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ఎంసీపీఐ మండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశాడు. ఈ మేరకు కేసముద్రం తహసీల్ కార్యాలయంలో మంగళవారం డీటీ ఎర్రయ్యకు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

30శాతం నిధులు కేటాయించాలి

డోర్నకల్: త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు భూక్యా శ్రీకాంత్ కోరారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం తహసీల్దారు కృష్ణవేణికి డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రమేశ్, అనిల్, చంటి, రాజేందర్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

గార్ల: ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షలుపైన రుణం తీసుకున్న రైతులందరికీ మాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం గార్లలో ఆయన మాట్లాడారు.

హామీలను నిర్లక్ష్యం చేయొద్దు

నెల్లికుదురు: రైతులకు రైతు భరోసా పూర్తిస్థాయిలో అందించి మహిళలకు ఆత్మీయ భరోసా విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబు గౌడ్, నర్సయ్య, వెంకన్న, భిక్షపతి, పుల్లయ్య పాల్గొన్నారు.

పంటల పరిశీలన



చిన్నగూడూరు: మండలంలోని తుమ్మల చెరువు, ఉగ్గంపల్లి గ్రామాల శివారులో వరి పంట పొలాలను మండల తహసీల్దార్ మహబూబ్ అలీ వ్యవసాయ అధికారులు ఏఓ భాస్కర్, ఏఈఓ పవన్ కళ్యాణ్ మంగళవారం పరిశీలించాడు. అనంతరం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన రైతు కొమిరెల్లి వరి పంటకు నీళ్ల లేక తన పంటపొలం ఎండిపోయిందని అధికారులకు చూపించాడు.

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలల్లో ఎండుతున్న వరి పొలాలను తహసీల్దార్ దామమోదర్, ఏఓ మహేందర్ మంగళవారం పరిశీలించారు. నీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతంలో యూరియాను 1శాతం నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జెర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల శ్రీనివాస్‌రెడ్డి (80) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మానుకోట మాజీ ఎంపీ మాలోతు కవిత నివాళులర్పించారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని మర్రితండా జీపీకి చెందిన ఎంబీబీఎస్ చదువుతున్న నిరుపేద విద్యార్థి విజయ్‌కి ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15వేల ఆర్థికసాయం మంగళవారం అందించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోహన్ తెలిపారు.

గూడూరు: జిల్లా హోంగార్డుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు గూడూరుకు చెందిన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్ మంగళవారం సంఘం సభ్యులకు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

తల్లీకుమారుడి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన కుమారుడిని వెంట తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోగా ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్తతో వాగ్వివాదం జరిగి వారం రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి కుమారుడిని వెంట తీసుకుని వెళ్లి తిరిగి రాలేదు. ఎలాంటి సమాచారం రాకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై వెలసిన శ్రీపద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నేటినుంచి ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వేణుగోపాల్ ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న నాటక పోటీలు



తొర్రూరు: చైతన్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని గరుగుబావి వద్ద జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను వేటా అధ్యక్షురాలు హనుమాండ్ల ఝూన్సీరెడ్డి ప్రారంభించారు. తొలిరోజు ‘స్వేచ్ఛ’ నాటికను హైదరాబాద్ కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా సమాఖ్య అధ్యక్షుడు మన్నూరు ఉమ, ప్రధాన కార్యదర్శి సుంకరనేని పినాకపాణి పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



మహబూబాబాద్ రూరల్: పర్వతగిరి ఎంపీపీఎస్‌లో..

మహబూబాబాద్ రూరల్: మండలంలోని పర్వతగిరి ఎంపీపీఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం బి.గీత, ఉపాధ్యాయులు, బానోతు హరినాయక్, రామాచారి, రాధిక, రాజేష్ బాబు పాల్గొన్నారు.

పెద్దవంగర: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరగూడెం ప్రాథమికోన్నత పాఠశాల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోల్తాకొట్టిన రెడ్ మిక్స్ లారీ



కేసముద్రం: రెడ్‌మిక్స్ లారీ అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన మండలంలోని కోరుకొంపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోరుకొండపెల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా కేసముద్రం నుంచి వెళ్తున్న రెడ్ మిక్స్ లారీ అదుపు తప్పి గ్రామంలోని బొడ్రాయి మూల మలుపు వద్ద బోల్తా కొట్టింది. దీంతో లారీ ముందు క్యాబిన్‌లో చిక్కున్న డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీసి, గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.